సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 12 । ఆగస్టు । 2024



మోగిన పెళ్లిబాజా

శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. బంగారం, బట్టలు షాపులు కిటకిటలాడుతున్నాయి.

8లో ▸



డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాడు. 14నెలలకే దిగుబడి వస్తుండగా లాభాలు గడిస్తున్నాడు.

9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అట్నంగూడలో సంబురాలు



భోజారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని అట్నంగూడ గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడంతో ఆదివారం గ్రామస్తులు సంబురాలు జరుపుకొన్నారు. ఇందుకు సహకరించిన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. అనంతరం భోజారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నాయకులు రామన్నయాదవ్, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పండరి, నాయకులు సంగీత్, సచిన్, ధనుంజయ్, నారాయణ, గజానన్, భారత్ తదితరులున్నారు.

‘108’లో ప్రసవం



శిశువును చూపుతున్న ఈఎంటీ కాశీనాథ్

సిరికొండ: 108 వాహనంలో గర్భిణి ప్రసవించి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. మండలంలోని బోరింగ్‌గూడ గ్రామానికి చెందిన ధ్రుపతాబాయి నిండు గర్భిణి. ఆదివారం ఆమెకు పురుటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది అంబులెన్స్‌తో బోరింగ్‌గూడకు చేరుకున్నారు. ధ్రుపతాబాయిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా సిరికొండ సమీపంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. వెంటనే చికిత్స కోసం ఇద్దరినీ పిట్టబొంగరం పీహెచ్‌సీకి తరలించినట్లు ఈఎంటీ కాశీనాథ్ తెలిపారు.

రేపు గుండె వైద్యశిబిరం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలోగల డైస్ సెంటర్‌లో మంగళవారం 18 ఏళ్లలోపు బాలబాలికలకు గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ కిమ్స్‌లోని పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వైద్యం అందిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో నలుగురు క్రీడాకారులు నాలుగు రజతాలు, ఒక కాంస్యంతో సత్తా చాటారు. విజేతలుగా నిలిచిన వారిలో తైక్వాండో సీనియర్ కోచ్ అన్నారపు వీరేశ్, క్రీడాకారులు శివకుమార్, వనితారాథోడ్, ఆర్ దివ్య ఉన్నారు. వీరు అక్టోబర్‌లో ఆగ్రాలో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి తదితరులు అభినందించారు.

నేడు వీడ్కోలు కార్యక్రమం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ, పదోన్నతులపై వెళ్తున్న వారికి సోమవారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండల వైద్యాధికారి సర్వారాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మండల పరిధిలోని వైద్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పాఠశాలలకూ గృహజ్యోతి!

- ఉచిత కరెంట్ ఇవ్వాలని నిర్ణయం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ఇప్పటికే పేరుకుపోయిన బిల్లులు
- సరిపోని మెయింటెనెన్స్ నిధులు
- సీఎం రేవంత్ నిర్ణయంపై హర్షం

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు
మొత్తం కనెక్షన్లు : 2,78,941
గృహజ్యోతి కనెక్షన్లు : 85,680
పాఠశాలల కనెక్షన్లు : 451

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం సర్కారు బడులకు ఉచిత విద్యుత్ అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గృహజ్యోతి పేరిట 200 యూనిట్ల వరకు వినియోగించుకునే గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. మార్చి నుంచి ఈ పథకం అమలవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలకూ ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో విద్యాశాఖ అధికారులు విద్యుత్ సౌకర్యమున్న పాఠశాలల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే సర్కారు బడులకూ జీరో బిల్లులు వచ్చే అవకాశముంది.

ఏళ్లుగా పెండింగ్‌లో బిల్లులు..

జిల్లాలో 2,78,941 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో గృహ విద్యుత్ కనెక్షన్లు 1,72,915 ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకానికి సంబంధించి 85,680 గృహాలకు పథకం అమలవుతోంది. ఈ గృహాలకు జీరో బిల్లులు జారీ చేస్తుండగా ప్రభుత్వం రూ.3కోట్ల 50లక్షల 51వేలు విద్యుత్‌శాఖకు చెల్లిస్తోంది. అయితే జిల్లాలో ప్రతినెలా మొత్తం కనెక్షన్లకు సంబంధించి రూ.19కోట్ల 60లక్షల 69వేల బిల్లులు వస్తున్నాయి. చాలా ప్రభుత్వ శాఖల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యుత్‌శాఖకు భారంగా మారింది. ఇందులో విద్యాసంస్థలూ ఉన్నాయి. జిల్లాలో 451 పాఠశాలలకు సంబంధించి ఐదారేళ్లుగా రూ.కోటీ 65లక్షల 86వేల బకాయిలున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కనెక్షన్లు తొలగించకుండా సరఫరాను కొనసాగిస్తున్నారు.

మెయింటెనెన్స్ నిధులు అంతంతే..

సర్కారు బడులకు జీరో విద్యుత్ బిల్లుల సౌకర్యం కల్పించనుండడంతో పేద విద్యార్థులకు మేలు జరగనుంది. వేసవిలో కరెంట్ కనెక్షన్లు లేని పాఠశాలల్లో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులున్నాయి. పాఠశాలలకు చాలీచాలని మెయింటెనెన్స్ నిధులు విడుదలవుతుండగా ఇవి విద్యుత్ నిర్వహణకే సరిపోతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించింది. ఫ్యాన్లు, ప్రొజెక్టర్లు, ట్యూబ్‌లైట్లు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వాటర్‌ప్లాంట్‌లు, కంప్యూటర్ విద్య తదితరాల నిర్వహణకు విద్యుత్ అవసరం ఉంటుంది. దీంతో ఒక్కో పాఠశాలకు నెలకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు బిల్లు వస్తోంది. మెయింటెనెన్స్ గ్రాంట్ రూ.5వేల నుంచి రూ.10వేల వరకు విడుదల చేస్తున్నారు. ఈ నిధులు పాఠశాలల్లోని మౌలిక వసతులకే సరిపోయే పరిస్థితి లేదు. దీంతో కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సొంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

ఇంకా ఉత్తర్వులు అందలేదు



పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించే విషయమై ప్రభుత్వం ఇంకా ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇప్పటికే జిల్లాలో 451 పాఠశాలలకు సంబంధించి రూ.కోటీ 65లక్షల 86వేల విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం గృహజ్యోతి పథకంలో భాగంగా 85,680 కనెక్షన్లకు సంబంధించి జీరో బిల్లులు అందిస్తున్నాం. ఈ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తోంది.

– జీఆర్ చౌహాన్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

జిల్లాలోని పాఠశాలలు

జిల్లాలో 678 లోకల్‌బాడీ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 56,533 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 17 కేజీబీవీల్లో 4,287 మంది, ఆరు మోడల్ స్కూళ్లలో 4,140 మంది, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 94మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలన్నీ డీఈవో పరిధిలోకి వస్తాయి. టీటీడీడబ్ల్యూ పాఠశాలలు 490 ఉండగా, 7,633 మంది, కేంద్రీయ విద్యాలయంలో 358 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరు మైనార్టీ పాఠశాలలు, ఆరు మహాత్మా జ్యోతిబాపూలే, ఒక స్పోర్ట్స్ స్కూల్, మూడు సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఆరు గిరిజన సంక్షేమ గురుకులాలు, మూడు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలూ ఉన్నాయి. జిల్లాలోని ఈ పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు కూడా ఉచిత విద్యుత్ అమలు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

న్యాయవ్యవస్థపై నమ్మకం కల్పించాలి



బోథ్‌లో భూమిపూజ చేస్తున్న హైకోర్టు జడ్జిలు వినోద్, సుజన, లక్ష్మణ్, పక్కన జిల్లా జడ్జి, కలెక్టర్

- హైకోర్టు జడ్జిలు వినోద్, సుజన, లక్ష్మణ్
- కోర్టు భవన నిర్మాణాలకు భూమిపూజ

బోథ్: న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించేలా న్యాయవాదులు, సిబ్బంది విధులు నిర్వహించాలని హైకోర్టు న్యాయమూర్తులు వినోద్‌కుమార్, సుజన, లక్ష్మణ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బోథ్ జూనియర్ సివిల్ కోర్టు, జడ్జి రెసిడెన్షియల్ భవన నిర్మాణాలకు ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అంతకుముందు జడ్జిలకు కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో జడ్జిలు మొక్కలు నాటారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. గతంలో కోర్టు భవన నిర్మాణాల బాధ్యత ఆర్‌అండ్‌బీ అధికారులు తీసుకునే వారని, ప్రస్తుతం నేషనల్ జ్యుడీషియల్ అకాడమీతో చర్చించి నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఎన్‌బీసీసీకి బోథ్ కోర్టు నిర్మాణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఏడాదిలోపు సంస్థ పనులు పూర్తి చేస్తుందని చెప్పారు. గతంలో బోథ్ కోర్టులో ప్రాక్టీస్ చేసిన వామన్‌రావు హైకోర్టు జడ్జిగా రిటైర్డ్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి పంద్రం శంకర్, ఎన్‌బీసీసీ అధికారి రాజారాం, న్యాయవాదులు హరీశ్‌కుమార్, విజయ్‌కుమార్, మోహన్‌రావు, సుభాష్, రూపేందర్‌సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతులను బెదిరిస్తే సహించం’

కైలాస్‌నగర్: రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ కోసం భూములివ్వాలని యాపల్‌గూడ రైతులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ బెదిరించడం దుర్మార్గమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో ఆదివారం పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూర్ల శంకరయ్య, బొమ్మకంటి రమేశ్, ఆత్రం రమాదేవి ఆధ్వర్యంలో 34వ వార్డు శాంతినగర్ కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. భూములివ్వకుంటే కట్టేసి లాక్కుంటామని ఎమ్మెల్యే రైతులను బెదిరించడం సరికాదని పేర్కొన్నారు. తాను రైతులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోనని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలి

త్వరలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలని కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో ఆదిలాబాద్‌రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. పార్టీ గెలుపు కోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ జంగు పటేల్, చిట్యాల భూమన్న తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరినవారితో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి

సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

తలమడుగు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండలంలోని సుండికి గ్రామంలోని అంతర్రాష్ట్ర రహదారిపై మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు గుకుంటి క్రాంతికుమార్ మాట్లాడారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని తెలిపారు. మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, నాయకులు మగిడి ప్రకాశ్, రమాకాంత్, నేతుల గంగన్న, ఐండ్ల మాలయ్య, గడుగు పోచన్న, రమేశ్, ప్రవీణ్, దేవన్న, అఖిలేశ్, నరేశ్, ప్రతాప్, వినోద్, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యోగిరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆర్థిక భారంతో ఆత్మహత్యకు పాల్పడిన వరంగల్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ యోగిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్ దేవేందర్ కోరారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి యోగిరెడ్డి మృతికి సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడుతూ.. సమాజహితం కోసం పాటుపడుతున్న జర్నలిస్టులు చాలామంది ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ జేఏసీ నాయకులు వెంకటేశ్, సురేశ్, సుధాకర్, సారంగపాణి, అశోక్, నరేశ్, ఫిరోజ్, సుభాష్, మహేశ్, శ్రీకాంత్, ప్రవీణ్, వెంకటేశ్, ఖీజర్, అస్మత్, నిలేశ్, నరేశ్, దీపక్, రాము, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి యోగిరెడ్డికి నివాళులర్పిస్తున్న జర్నలిస్ట్ జేఏసీ నాయకులు

ఇన్‌స్ట్రక్టర్ల నియామకమెప్పుడో!

- రాష్ట్రంలో రెండు జిల్లాలకే పర్మిషన్
- ఉమ్మడి జిల్లాకు అనుమతిస్తే మేలు
- భారీసంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు
- స్కూళ్లలో కుంటుపడుతున్న బోధన



ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు తోడ్పడుతోంది. ఇటీవల పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఈనెల 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించగా ఇంకా ఫలితాలు వెలువడలేదు. కాగా, కొన్నేళ్లుగా నిరీక్షించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇటీవల ప్రమోషన్లు కల్పించింది. బదిలీలూ చేపట్టింది. దీంతో పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడి బోధన కుంటుపడుతోంది. ఆయా జిల్లాల అధికారుల అభ్యర్థ మేరకు ప్రభుత్వం నారాయణపేట్, వికారాబాద్ జిల్లాలకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరిట నియామకాలు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.15,600 చెల్లించేందుకు అంగీకరించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఉపాధ్యాయ ఖాళీలను ఇన్‌స్ట్రక్టర్లతో నియమిస్తే విద్యార్థులకు మేలు జరగనుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కుంటుపడుతున్న బోధన

గతంలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించి తరగతులు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా వీవీల నియామకం చేపట్టడం లేదు. ఆయా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ కాలం వెల్లదీశారు. ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులున్నచోట విద్యార్థుల సంఖ్య లేదు. విద్యార్థులున్నచోట సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 100 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు, మరో 50 వరకు ఒక్కో ఉపాధ్యాయుడు లేని పాఠశాలలున్నాయి. ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ సమయంలో పాఠశాలకు సెలవు అనే పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఏకోపాధ్యాయుడున్న పాఠశాల నుంచి ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదు. బదిలీ జరిగినా సదరు ఉపాధ్యాయుడు అదే చోట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక నాణ్యమైన విద్య అందడం లేదు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంది. కనీస బోధన సామర్థ్యాలూ కనిపించడం లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డీఈవో పరిధిలో 2,848 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 11,286 ఉపాధ్యాయులుండాల్సింది కాగా, 2,079 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డీఎస్సీ నియామకాలు చేపట్టేదాకా తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే విద్యార్థులకు ప్రయోజనం జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే రెండు జిల్లాల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరిట డీఎస్సీ ప్రక్రియ పూర్తయ్యేదాకా విద్యాబోధన చేసేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలోనూ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే సర్కారు బడుల్లో చదువుకుంటున్న ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	కుమురంభీం	మొత్తం
డీఈవో పరిధిలో పాఠశాలలు	678	714	735	721	2,848
ఉపాధ్యాయ పోస్టులు	3,028	2,839	2,975	2,444	11,286
ఉపాధ్యాయ ఖాళీలు	590	496	652	341	2,079

ఖాళీలతో తప్పని తిప్పలు

ఆదిలాబాద్ జిల్లాలో డీఈవో పరిధిలో 678 లోకల్‌బాడీ, ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 56,533 మంది విద్యార్థులు చదువుతున్నారు. 17 కేజీబీవీలు, ఆరు మోడల్ స్కూళ్లు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. 2017 తర్వాత డీఎస్సీ నియామక ప్రక్రియ చేపట్టలేదు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ వేసినా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. ఇటీవల ఆన్‌లైన్ ద్వారా పరీక్షలూ నిర్వహించింది. జిల్లాలో డీఎస్సీ ద్వారా 324 పోస్టులు భర్తీ చేయనుంది. ఈ ప్రక్రియ మరో రెండు, మూడు నెలల వరకు పూర్తయ్యే అవకాశాలు కానరావడం లేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయ పోస్టులు 3,028 మంజూరు కాగా, ప్రస్తుతం 2,437మంది పనిచేస్తున్నారు. 590 ఖాళీలున్నాయి. వీటిలో 215 ఎస్జీటీ పోస్టులు, 375 స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎం, పీఈటీ, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత సెప్టెంబర్‌లో 50 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించింది. గత నెలలో దాదాపు 250 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. దీంతో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టుల ఖాళీ అయ్యాయి.

ఉత్తర్వులు రాలేదు



అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. జిల్లాలో 590 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బోధనకు ఆటంకం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ఖాళీల వివరాలు గుర్తిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో కూడిన పోస్టు చేసిన బీఆర్ఎస్ నాయకుడు గోగుల రవీందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. సీఐ రవీందర్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా బీఆర్ఎస్ నాయకులు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు ఎండీ బషీర్, చెన్నూరి శ్రీధర్, పాతర్ల నాగరాజు, చెన్నూరి రాజేశ్, ఎండీ హజు, లింగంపల్లి మహేశ్, వసీం, కలీల్ , సుల్తాన్, ముంతజీర్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని చింతకుంట వాడ కాలనీలో లింగయ్య ఇంట్లో ఆదివారం ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. లింగయ్య పురాతనమైన ఇంటికి తాళం వేసి ఉంది. గమనించిన ఇద్దరు మహిళలు వారి పిల్లల్ని ఇంటి బయట వదిలి, చోరీకి యత్నించారు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు.

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో శనివారం రాత్రి రెండోషిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో ట్రామర్ కార్మికుడు సోమశెట్టి శరత్‌కి గాయాలయ్యాయి. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరితోనే గనిలో ప్రమాదాలకు నెలవుగా మారిందని పలువురు కార్మికులు తెలిపారు. ప్రమాదాలు అరికట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. పక్కా సమాచారంతో కాలనీలో ఓ ఇంటిపై ఆదివారం దాడి చేసి వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.32,870 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సిబ్బంది బాబాజీ, సుబ్బారావు, భరత్ పాల్గొన్నారు.

కుండపోత వర్షం



మత్తడి దూకి ప్రవహిస్తున్న నీల్వాయి

వేమనపల్లి: మండల కేంద్రంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. పొలాలు చెరువులను తలపించాయి. నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకి ప్రవహించింది. కాగా, ఉదయం పత్తి చేలల్లో కూలీలతో రైతులు దొరకొట్టేందుకు అరకలు, కలుపు, మందు స్ప్రే చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం కుండపోత వానతో పొలాల్లో నీరు చేరింది.

మోగిన పెళ్లిబాజా



నిర్మల్‌లో షాపింగ్ చేస్తున్న మహిళలు(ఫైల్)



- శ్రావణంలో శుభముహూర్తాలు
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- ఫంక్షన్ హాళ్ల ముందస్తు బుకింగ్
- ఈవెంట్ మేనేజర్లు, ఫొటోగ్రాఫర్లు, బ్యూటీషియన్లకు గిరాకీ

నిర్మల్‌ఖిల్లా: మూడు నెలల మూఢం తర్వాత శ్రావణమాసం ప్రారంభమైంది. ఐదారురోజుల నుంచి శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. పెళ్లిళ్లు, నూతన గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు మంచిరోజులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఫంక్షన్ హాళ్లు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ మేనేజర్లు, బ్యాండ్ మేళాలు, పూలు తదితర వాటికి గిరాకీ పెరిగింది. బంగారం, బట్టలు షాపుల్లో వధూవరుల కుటుంబ సభ్యులు కొనుగోళ్లలో బిజీగా ఉంటున్నారు. దీంతో ఆ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

ఫంక్షన్ హాళ్ల ధర రూ.లక్ష నుంచి మొదలు..

పెళ్లి తేదీ ఖరారైన రోజునే ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు. వీటి అద్దె రూ.లక్ష నుంచి మొదలై రూ.8 లక్షల వరకు ఉన్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌తో రేట్లు అమాంతం పెంచారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 200లకు పైగా ఫంక్షన్ హాళ్లు ఉండగా, ఇప్పటికే నెల రోజుల వరకు బుకింగ్ పూర్తయినట్లు యజమానులు పేర్కొంటున్నారు.

సినిమా షూటింగులు తలపించేలా..

సినిమా షూటింగులు తలపించేలా పెళ్లి వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగానే ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తున్నారు. దీంతో ఫొటో, వీడియోగ్రాఫర్లకు గిరాకీ పెరగడం, ఈవెంట్ మేనేజర్లు, ప్రోగ్రాం ఆర్గనైజర్లు పెళ్లి పనుల నిర్వహణలో బిజీబిజీగా ఉన్నారు. అదేవిధంగా వేడుకల్లో వధూవరులు అందంగా కనిపించడానికి బ్యూటీషియన్లను సంప్రదిస్తున్నారు. ప్యాకేజీ కింద రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. ఇలా మంగళవాయిద్యాలు, ట్రావెల్స్ వాహనాలు, పూల అలంకరణ, టెంట్ సామగ్రి, వంటల నిర్వాహకులు ఆర్కెస్ట్రా, పురోహితులు, ఈవెంట్ మేనేజర్లకు పెళ్లిళ్ల సీజన్‌లో గిరాకీ లభిస్తోంది.

పూలు తప్పనిసరి..

ఏదైన శుభకార్యాలకు పూలు తప్పనిసరి. మల్లె, బంతి, చామంతి, గులాబీ తదితర పూలకు డిమాండ్ ఉంది. వివిధ రకాల దండలు, మాలలు, డిజైన్లు, డెకరేషన్ల కోసం ఈవెంట్ మేనేజర్లు, ఆర్గనైజర్లు పూలు వినియోగిస్తుంటారు. అలాగే, వధూవరుల కుటుంబసభ్యులతో జిల్లా కేంద్రాల్లోని షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి.



ముస్తాబైన కల్యాణ మండపం (ఫైల్)

శుభ ముహూర్తాల తేదీలు..

ఈనెల 8, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో వివాహాలకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నెలరోజుల్లో దాదాపు 25 వేల నూతన జంటలు పెళ్లిబంధంతో ఏకం కానున్నారని నిర్మల్‌కు చెందిన పురోహితుడు సముద్రాల శ్రీకాంతాచార్యులు తెలిపాడు.

చేతినిండా పని లభించింది



పెళ్లి డెకరేషన్ల కోసం డిజైన్లు తయారు చేస్తుంటాం. వధూవరుల కుటుంబీకుల అభిరుచికి అనుగుణంగా డిజైన్లు చేస్తాం. మూఢం కారణంగా మూడు నెలలు తర్వాత శ్రావణ మాసంలో చేతినిండా పని లభించింది.

– బి.సంతోష్, డెకొరేటర్, ఈవెంట్ మేనేజర్

అభిరుచికి అనుగుణంగా..



వధూవరులు, కుటుంబసభ్యుల అభిరుచులకు అనుగుణంగా వెడ్డింగ్, ప్రీ వెడ్డింగ్‌లు, ఫొటో, వీడియోగ్రఫీ చేస్తుంటాం. వేడుకను అందంగా చిత్రీకరిస్తాం. ప్రస్తుతం సీజన్ మొదలుతో బిజీబిజీగా ఉన్నాం.

– రామరాజ్ కాంద్రే, వెడ్డింగ్ ఫొటోగ్రఫీ స్పెషలిస్టు

తల్లడిల్లిన కన్నతల్లి



పూజ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

- జ్వరంతో పూజ మృతి
- గుండాయిపేటలో విషాదం
- కన్నీరుపెట్టిన గ్రామస్తులు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి

కౌటాల: 'చిన్నప్పటి నుంచే తన కుమార్తె చదువు,, క్రీడల్లో ముందుండేదని, చదువు పూర్తికాగానే పోలీస్ ఉద్యోగం సాధిస్తానని చెప్పేదని, ఇంతలోనే దేవుడు నాకు అన్యాయం చేశాడు 'అంటూ పూజ మృతదేహంపై పడి తల్లి సురేఖ బోరున విలపించింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ వ్యవసాయం చేస్తూ సంతోషంగా జీవిస్తున్న తమ కుటుంబంలో మాయదారి జ్వరం తమ కుమారుడిని పొట్టనపెట్టుకుందని కాళీదాస్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు బోరున విలపించారు. ఒకే కాలనీకి చెందిన ఇద్దరు ఒకేరోజు మృతిచెందడంతో కౌటాల మండలం గుండాయిపేటలో విషాదం అలుముకుంది. అందరితో కలివిడిగా ఉండే విద్యార్థి పూజ, యువకుడు కాళీదాస్ మృతదేహాలను చూసి ఊరంతా కన్నీరు పెట్టుకుంది. ఆదివారం అశ్రునయనాల మధ్య మృతదేహాలకు కుటుంబీకులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వివరాలు సేకరిస్తున్న వైద్యశాఖ అధికారులు

గుండాయిపేట గ్రామానికి చెందిన పూజ, కాళీదాస్ జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందడంతో ఆదివారం సాయంత్రం డీఎంహెచ్‌వో తుకారాం గుండాయిపేట్ గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూజ మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారం, ఎంపీవో మహేందర్, కార్యదర్శి తిరుపతి, వైద్యసిబ్బంది ఉన్నారు.

జ్వరంతో యువకుడి మృతి

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన బోయర్ ఉమాజీ–అనసూయ దంపతుల పెద్దకుమారుడు కాళిదాస్(32) జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కాళిదాస్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో ఈనెల 7న కౌటాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం కాళిదాస్ అంత్యక్రియలు గ్రామంలో పూర్తి చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు సోదరులు ఉన్నారు. కాగా, జ్వరంతో ఇదే గ్రామానికి విద్యార్థి జాడె పూజ(16) శనివారం మృతి చెందింది. గంటల వ్యవధిలో ఇద్దరు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సైబర్ నేరగాళ్ల మోసం

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాధితుడి ఫోన్‌లోకి యాప్‌ను పంపించి లింక్ ఓపెన్ చేస్తే రూ.900లు వస్తాయని చెప్పడంతో నమ్మాడు. బాధితుడు అది ఓపెన్ చేయగా నగదు వచ్చింది. వారం తర్వాత వారు చెప్పినట్టుగా రూ.10 వేలు బ్యాంక్ ఖాతాలో వేయగా రూ.19 వేలు వచ్చాయి. కొన్ని రోజులకు నేరగాడు ఫోన్ చేసి లింక్ పంపించాడు. రూ.20 వేలు పంపిస్తే రూ.68 వేలు వస్తాయని చెప్పడంతో డబ్బు పంపించాడు. రాలేదని హోల్డ్‌లో పడ్డాయని రూ.68 వేలు డిపాజిట్ చేస్తే మొత్తం కలిపి డబుల్ వస్తాయని తెలపడంతో డిపాజిట్ చేశాడు. ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయానని బాధితుడు గ్రహించి 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వర్గీకరణపై బీజేపీ కుట్ర



నిరసన తెలుపుతున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మనువాద పార్టీ బీజేపీ కుట్ర అని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. దళితులకు క్రిమిలేయర్ ద్వారా దెబ్బతీయాలని, ముున్ముందు రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర దాగుందన్నారు. షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌ను 15 నుంచి 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. నాయకులు బంగారు సాయిలు, కిష్టయ్య, వెంకటేశ్వర్లు, భవిత, దీపక్, రమేశ్, సుధాకర్, శ్రీనివాస్, నరేశ్, విజయ్ కుమార్, చంద్రశేఖర్, నర్సయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ హైమద్ (35) ఉరేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు..షేక్ హైమద్ కూలీ పనులు చేసుకుంటూ భార్యను పోషించుకునేవాడు. గత రెండు రోజుల నుంచి కనపించకపోవడం, ఇంట్లో నుంచి కుళ్లిన వాసన రావడంతో గ్రామస్తులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. శవం కుళ్లిపోయి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

గోడ పై నుంచి పడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ జిన్నింగ్ మిల్లు గోడపై నుంచి పడి గొల్లి రాజేశ్వర్ (54) మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఆదిలాబాద్‌లోని చోట తలాబ్‌కు చెందిన రాజేశ్వర్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ప్రమాదవశాత్తు గోడపై నుంచి పడి మృతి చెందారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై ముజాహిద్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందాల్సి ఉందన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

మామడ: మామడ సమీపంలో ఆదివారం పాలు తీసుకువెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ అనిల్, క్లీనర్ విఘ్నేషలు వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. జేసీబీ సాయంతో వారిని బయటకు తీశారు. గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

భగీరథ పైపుల ధ్వంసం!

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్‌లో డంప్ చేసిన మిషన్ భగీరథ పైపులను ఆదివారం ఇద్దరు వ్యక్తులు జేసీబీతో ధ్వంసం చేస్తుండగా, స్థానికులు గమనించి అడ్డుకున్నారు. ఎందుకు ధ్వంసం చేస్తున్నారని ప్రశ్నించగా, అక్కడి నుంచి పారిపోయినట్లు కాంగ్రెస్ నాయకుడు శంకర్ చంద్రే తెలిపారు. కొన్నిరోజులుగా పైప్‌లు ధ్వంసం చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై పట్టణ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

శిథిలావస్థలో..

- 3 వేల పైచిలుకు సింగరేణి క్వార్టర్లు
- విరిగిన తలుపులు కిటికీలు
- నిర్వహణ పట్టించుకోని ఉన్నతాధికారులు



నిరుపయోగంగా స్పెషల్ సీ క్వార్టర్లు



శిథిలమవుతున్న క్వార్టర్లు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంపై ఏం ప్రయోగాలు జరుగుతున్నాయి..పని గట్టుకుని పట్టణాన్ని పనికిరాకుండా చేస్తున్నది ఎందుకు..? వేల క్వార్టర్లు శిథిలమై..తలుపులు కిటికీలు లేక సాక్షాత్కారమిస్తోంటే ఎందుకని చోద్యం చూస్తున్నారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక్కోక్క డిపార్ట్‌మెంట్, గనులను భూస్థాపితం చేస్తూ వస్తున్న యాజమాన్యం క్వార్టర్ల విషయంలో స్పష్టమైన నిర్ణయం ఏం తీసుకుంటుందనేదే పెద్ద సంశయం కలిగిస్తోంది. సంస్థ కార్యాలయాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాక ఈ క్వార్టర్లను ఏం చేస్తారు. కనీసం అద్దె ప్రాతిపదికన ఇతరులకు కేటాయించే యోచన ఏమైనా ఉందా? భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిన రామకృష్ణాపూర్ సింగరేణి క్వార్టర్ల శిథిలావస్థకు చేరాయి.

రామకృష్ణాపూర్ ప్రాంతం గతంలో ఒక ఏరియాగా వెలుగొందింది. ఏడెనిమిది భూగర్భ గనులు, జీఎం కార్యాలయం సహా వివిధ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం వేలాది క్వార్టర్లు నిర్మించారు. మొత్తం 3వేల పైచిలుకు క్వార్టర్లు పట్టణ పరిధిలో ఉన్నాయి. ఏ, స్పెషల్ ఏ, బీ టైప్, , సీ, స్పెషల్ సీ టైప్, సీ–2 క్వార్టర్లు నిర్మించారు. వీటితోపాటు డీ టైప్, స్పెషల్ డీ టైప్, షిర్కే, నాగార్జున క్వార్టర్లు నిర్మించారు. గనులకు సమానంగా కార్మికుల సంఖ్య ఉండటంతో క్వార్టర్ల కేటాయింపు అదే స్థాయిలో జరిగింది. కాలక్రమేణా ఏరియా ఎత్తివేశారు. భూగర్భ గనులు కూడా మూతపడ్డాయి. కళకళలాడిన పట్టణం కళావిహీనంగా మారింది. దీంతో క్వార్టర్లు ఎందుకు పనికి రాకుండా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

ఇతర ప్రాంతాలకు బదిలీలు

స్థానికంగా ఉన్న బొగ్గు గనులు మూతపడడంతో కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లికి కొందరు వెళ్లగా మందమర్రి, గోదావరిఖని, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో మరికొందరు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కార్మికుల సంఖ్యను తీసుకుంటే 500 నుంచి 600 మంది వరకే ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే 2 వేలకు పైగా క్వార్టర్లలో ఇతరులు ఉంటుండగా మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. అయినా, ఏరియాకు వచ్చే ఏ ఉన్నతాధికారి కూడా ఈ క్వార్టర్లపై ఏ మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా క్వార్టర్ల నిర్వహణ సైతం గాలికి వదిలేశారని కార్మికులు అంటున్నారు. రోజురోజుకూ ఎదురవుతున్న చేదు అనుభవాల నేపథ్యంలో కనీసం ఇక్కడే పుట్టి..ఇక్కడే పెరిగిన తామంతా ఏమైపోవాలనే ఆవేదన పలువురి నుంచి వ్యక్తమవుతోంది.

అద్దె ప్రాతిపదికన కేటాయిస్తే మేలు

రామకృష్ణాపూర్‌లో క్వార్టర్లను అద్దె ప్రాతిపదికన కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చాలా వరకు శిథిలమయ్యాయి. తలుపులు కిటికీలు దొంగలపాలవుతున్నాయి. వర్షాలకు కొన్ని క్వార్టర్లు ఉరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో అద్దెకు ఇచ్చే అంశాన్ని ఆలోచిస్తే బాగుంటుందని సంస్థకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కళావిహీనంగా మారి పట్టణ ఉనికే ప్రశ్నార్థకమైన రామకృష్ణాపూర్‌లో శిథిలమైపోతున్న క్వార్టర్లనైనా బాగుచేయాలని కార్మికులు, కార్మికేతరులు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంపైనే ఆధారపడిన వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతున్నారు. సింగరేణిలో గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఈ దిశగా ఆలోచన చేసి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని విన్నవిస్తున్నారు.

'కడెం'లో బోటు షికారు



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్ట్ అందాలను వీక్షించి.. ఆ తర్వాత బోటింగ్ చేశారు. అనంతరం వనభోజనాలు చేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

'వసతి' అధ్వానం





శిథిలావస్థకు చేరిన వసతిగృహ భవనం



పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి వసతితో కూడిన విద్యనందిస్తుంటే అధికారుల నిర్లక్ష్యం వారి పాలిటశాపంగా మారుతోంది. జైనథ్ మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం మావల మండల కేంద్రంలో కొనసాగుతోంది. తరగతి, వసతి గదులు అవే కావడం, అందులో ఫ్యాన్లు లేకపోవడం, ట్యూబ్ లైట్లు స్విచ్ బోర్డులు పనిచేయక అధ్వానంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దీనావస్థలో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్